

# గుండెపోటుతో కమ్మరి శివయ్య మృతి..

## ఆధారాన్ని కోల్పోయిన కుటుంబం

**పని చేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిన శివయ్య**

**భార్య, ఇద్దరు కుమార్తెలు, వికలాంగ కుమారుడితో కుటుంబం దిక్కుతోచని స్థితి**

**ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికుల విజ్ఞప్తి**

**గుమ్మడిదల, జూలై 5 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదలలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబానికి అండగా నిలుస్తూ కమ్మరి వృత్తితో జీవనం సాగిస్తున్న కమ్మరి శివయ్య (48) ఆదివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రోజువారీ మాదిరిగానే ఇంటి వద్ద కమ్మరి పని చేస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. శివయ్య మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక వికలాంగ కుమారుడు ఉన్నారు. తన కష్టార్జితంతో కుటుంబాన్ని పోషిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న ఆయన ఆకస్మిక మరణంతో ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. గుమ్మడిదలతో పాటు పరిసర గ్రామాల రైతులకు కమ్మరి పనులు చేస్తూ శివయ్య మంచి గుర్తింపు సంపాదించారు. మృదుస్వభావంతో అందరితో కలిసిమెలిసి ఉండే ఆయన మృతి వార్త తెలిసి స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన శివయ్య మరణంతో జీవనాధారాన్ని కోల్పోయిన ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అన్ని విధాలుగా అండగా నిలవాలని గ్రామస్తులు, స్థానికులు కోరుతున్నారు.

# గాయపడిన ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు


**కేటీఆర్ వాహన శ్రేణి ప్రమాదంలో ఎమ్మెల్సీకి గాయాలు**

**ఆసుపత్రిలో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేష్ గౌడ్**

**త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్ష**

**గుమ్మడిదల , జూలై 5 ( నేటి ప్రస్థానం ):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంపు గృహాన్ని సందర్శించేందుకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బయలుదేరిన వాహన శ్రేణిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు గాయపడ్డారు. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఉద్యమనేత జిన్నారం వెంకటేష్ గౌడ్ ఆసుపత్రికి చేరుకుని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ప్రమాదం నుంచి ఆయన సురక్షితంగా బయటపడడం సంతోషకరమని పేర్కొంటూ, ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఆలయాలలో మానసిక ప్రశాంతత లభిస్తుంది... కొలుకుల జై హిందు గారు



ఆలయాలను సందర్శించుకోవడం వలన మానసిక ప్రశాంతత తో పాటు క్రమశిక్షణ అలవాటు అవుతుందని కుత్బుల్లాపూర్ బి ఆర్ ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ గారు అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్ పురి కాలనీలో పోచమ్మ దేవాలయంలో దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన మరియు అమ్మవారి కళ్యాణం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైహింద్ గారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్. మల్లేష్ గౌడ్. అరుణ్ రెడ్డి ప్రవీణ్ గుప్తా అప్పల శీను. శ్రీకాంత్ రెడ్డి. శ్రీకాంత్. రాజ్ కుమార్. ఆంజనేయులు. బాలు యాదగిరి. తదితరులు పాల్గొన్నారు

# కాలనీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**మారుతీనగర్, మధురానగర్ కాలనీల్లో పర్యటించి ప్రజలతో ముఖాముఖి**

**యూజీడీ, సీసీ రహదారులు, వర్షపు నీటి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు**

**త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని హామీ**


**గుమ్మడిదల (అమీన్‌పూర్), జూలై 5 ( నేటి ప్రస్థానం ):** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతీనగర్, మధురానగర్ కాలనీల్లో పర్యటించి స్థానికులతో సమావేశమై వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, సీసీ రహదారుల పునర్నిర్మాణం, వర్షపు నీటి కాలువల నిర్మాణం అత్యవసరమని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మారుతీనగర్, మధురానగర్ కాలనీల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, సీసీ రహదారుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు సురేష్‌ను ఆదేశించారు. ప్రతిపాదనలు సిద్ధమైన వెంటనే నిధులు మంజూరు చేసి, త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. బీరంగూడ శివాలయం కమాన్ వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉప ఇంజినీరు వెంకటరమణకు ఎమ్మెల్యే సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో ప్రతి కాలనీని అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు జగదీష్, రమేష్ గౌడ్, సునీత, లక్ష్మీకాంత్ రెడ్డి, దాసు, మల్లేష్‌తో పాటు ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చైతన్యానికి దేవాలయాలు కేంద్రబిందువులు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**బొల్లారంలో పోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాల్లో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్**

**సనాతన సంప్రదాయాల పరిరక్షణలో దేవాలయాల పాత్ర కీలకమని వ్యాఖ్య**





**గుమ్మడిదల (బొల్లారం), జూలై 5 ( నేటి ప్రస్థానం ):** దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా ఆధ్యాత్మికతకు, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాల పరిరక్షణకు కేంద్రాలుగా నిలుస్తాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం డివిజన్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ప్రజలందరూ అమ్మవారి కటాక్షంతో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, దేవాలయాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు నైతిక విలువలు, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడంలో విశిష్ట పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధితో గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని, భావితరాలకు భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలను అందించడంలో దేవాలయాలు కీలక వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**బీరంగూడలో రెండు ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొనడం**

**ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు**

**ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తామని హామీ**





**గుమ్మడిదల (అమీన్‌పూర్), జూలై 5 (నేటి ప్రస్థానం):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం బీరంగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీ సాయి మెడోస్ కాలనీలోని పోచమ్మ దేవాలయం, ఎన్ఎస్ఎల్ కాలనీలోని వినాయక స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. భగవంతుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో భక్తి భావంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని భవిష్యత్తులోనూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ప్రమోద్ రెడ్డి, లింగం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం...




# తస్మాత్ జాగ్రత్త!

## తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ నీడలు



### భాషపై వెటకారం... అస్తిత్వంపై దాడి
### తెలంగాణను తేలిగ్గా తీసుకుంటే తగిన సమాధానం తప్పదు
### మళ్లీ మోగుతున్న తెలంగాణ స్వాభిమాన శంఖం
### అస్తిత్వానికి ముప్పు... అప్రమత్తతే ఆయుధం
### తెలంగాణ భాషను అవమానిస్తే ప్రజాస్పందన తప్పదు
### తెలంగాణ ఆత్మగౌరవంపై కొత్త దాడులా?



**తెలంగాణ అస్తిత్వ స్వరాలు సాధారణ నినాదాలు కావు. అవి కాలం కాల్చిన అనుభవాల నుంచి పుట్టిన జ్వాలలు. గాలి తగిలితే మండే భాస్వరాలు. అవమానం ఎదురైతే ఆగ్రహంగా ఎగిసే అగ్నికణాలు. ఏడు దశాబ్దాలుగా తెలంగాణ సమాజం తన భాష, యాస, సంస్కృతి, చరిత్ర, స్వాభిమానాన్ని కాపాడుకునేందుకు చేసిన పోరాటాల వెనుక ఇదే శక్తి ఉంది. ఆ చరిత్ర తెలియని వారు తెలంగాణ భావోద్వేగాలతో చెలగాటమాడాలని చూస్తే, ప్రజాస్పందన ఎంత తీవ్రంగా ఉంటుందో గత ఉద్యమాలు ఎన్నోసార్లు చాటిచెప్పాయి.**

**ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కరం దాటింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అస్తిత్వానికి పూర్తి భద్రత లభించిందని భావించినవారికి ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తొమ్మిదిన్నరేళ్లపాటు మౌనంగా ఉన్న కొన్ని శక్తులు రెండున్నరేళ్లుగా మళ్లీ తమ స్వరాన్ని పెంచుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నవారి వైఖరి, రాజకీయ పరిణామాలు, సాంస్కృతిక ప్రతీకలపై జరుగుతున్న చర్చలు తెలంగాణ సమాజంలో కొత్త సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యమకారులు మరోసారి సాంస్కృతిక ఉద్యమానికి సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.**

ఇటీవల 'ఇడుపు కాయితం' అనే సినిమా పేరుపై సోషల్ మీడియాలో జరిగిన వెటకారాలు ఈ చర్చకు మరింత మంట పెట్టాయి. తెలంగాణ పదాన్ని, యాసను, స్థానిక పలుకుబడిని అవహేళన చేసే ధోరణి మళ్లీ బయటపడిందని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. "తెలుగు డబ్బింగ్ వెర్షన్ ఉంటుందా?", "సబ్టైటిల్స్ వేస్తారా?" అంటూ కొందరు చేసిన వ్యాఖ్యలు సాధారణ సరదా వ్యాఖ్యలు కావని, తెలంగాణ భాషపై పాతకాలం నుంచి కొనసాగుతున్న వివక్షకు అవే కొత్త రూపాలని విమర్శిస్తున్నారు.తెలంగాణ భాషను వెక్కిరించడం కొత్త విషయం కాదు. సమైక్య రాష్ట్ర కాలంలో సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు, ప్రజా వేదికల్లో తెలంగాణ యాసను తరచూ హాస్యానికి పరిమితం చేశారు. విలన్లకు, జోకర్లకు, అమాయక పాత్రలకు తెలంగాణ భాషను ఉపయోగిస్తూ, ఇతర ప్రాంతాల భాషలను ప్రధాన పాత్రలకు కేటాయించే సంప్రదాయం చాలాకాలం కొనసాగింది. ఇది కేవలం భాషా వినియోగం కాదు; ఒక ప్రాంత ప్రజల సామాజిక గౌరవాన్ని దెబ్బతీసే సాంస్కృతిక రాజకీయమని ఉద్యమకారులు అప్పటినుంచే చెబుతూ వచ్చారు.

**అయితే తెలుగు భాషపై జరుగుతున్న చర్చలో తెలంగాణ పాత్రను విస్మరించడం చారిత్రకంగా సరైనది కాదు. తెలంగాణ నేలపై లభించిన శాసనాలు, సాహిత్య సంపద, కవుల రచనలు, భాషా పరిణామాలు తెలుగు వైభవానికి కీలక ఆధారాలు. కరీంనగర్ జిల్లాలోని బొమ్మలగుట్ట శాసనం తెలుగు భాషా చరిత్రలో ప్రముఖ స్థానం పొందింది. తెలంగాణ ప్రాంతంలో భాష, సాహిత్యం, జానపదం, సామాజిక జీవితం ప్రత్యేక రూపంలో అభివృద్ధి చెందాయి. వాటిని ఒకే ప్రమాణంతో కొలవడం లేదా వాటిని తక్కువ చేసి చూపడం సరికాదు.**

తెలుగు అనేది విశాలమైన భాషా ప్రపంచం. ఉత్తరాంధ్రకు ఒక యాస ఉంది. రాయలసీమకు మరో పలుకుబడి ఉంది. కోస్తాంధ్రకు మరో భాషా రీతీ ఉంది. తెలంగాణకు తనదైన పదజాలం, ఉచ్చారణ, సామెతలు, జీవన అనుభవాలతో కూడిన ప్రత్యేకత ఉంది. ఈ భిన్నత్వమే తెలుగు భాషకు అందం. ఒక ప్రాంత భాషను ప్రమాణ భాషగా నిలబెట్టి, మిగతా ప్రాంతాల పలుకుబడులను తక్కువ చేయడం భాషా ప్రేమ కాదు. అది ఆధిపత్య భావజాలం.

సమైక్య రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'ఆంధ్ర' అనే పదం రాజకీయంగా, పరిపాలనాపరంగా విస్తృతంగా స్థిరపడింది. కాలక్రమంలో దానిని తెలుగుకు పర్యాయంగా కూడా ఉపయోగించారు. కానీ తెలంగాణ అనే పదాన్ని, తెలంగాణ చరిత్రను, తెలంగాణ ప్రజల ప్రత్యేక గుర్తింపును అదే స్థాయిలో అంగీకరించడానికి చాలా శక్తులు సిద్ధంగా లేవనే విమర్శ ఉంది. తెలంగాణ భాషలో ఉర్దూ పదాలు ఉన్నాయని వెక్కిరించినవారు, ఇతర ప్రాంతీయ భాషల్లోని ఇంగ్లిష్ పదాల ప్రవాహాన్ని మాత్రం సమస్యగా చూడలేదు. ఇది భాషా విమర్శ కంటే రాజకీయ పక్షపాతమే ఎక్కువగా కనిపించే అంశం.

తెలంగాణ తల్లి భావన కూడా కొత్తది కాదు. దాశరథి వంటి మహాకవుల రచనల్లో తెలంగాణ తల్లి ప్రతిధ్వనించింది. అయినా దశాబ్దాలపాటు తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, వైతాళికులు, సాహిత్యకారులు పాఠ్యాంశాల్లో తగిన స్థానం పొందలేదు. తెలంగాణ సామాజిక, ఆధ్యాత్మిక, భౌగోళిక వైభవం నిర్లక్ష్యానికి గురైంది. ఆ వివక్షను ఎదుర్కొంటూనే ప్రజలు తమ త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నారు. భాషా సంస్కృతులను పతాక స్థాయికి తీసుకెళ్లారు.




**రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లోనే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే ఘటనలు చోటుచేసుకున్నాయి. 2014లో తెలంగాణ శాసనసభ తొలి సమావేశాల సమయంలో కొందరు దళిత, బహుజన ఎమ్మెల్యేలపై ఒక టెలివిజన్ చానల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఆ ఘటన తెలంగాణ సమాజానికి మీడియా వ్యవహారశైలి గురించి మరోసారి గుర్తుచేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ఆ సంస్థపై తీవ్రంగా స్పందించడం కూడా అదే నేపథ్యంలో జరిగింది.**

నేటి రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణ పక్షాన ఎవరు నిలుస్తున్నారు? తెలంగాణ అస్తిత్వాన్ని ఎవరు కాపాడుతున్నారు? అనే ప్రశ్నలు మళ్లీ ముందుకు వస్తున్నాయి. తెలంగాణ పదం డిక్షనరీలో లేదని, అది కొందరు సృష్టించినదని వ్యాఖ్యానించే ధోరణి బయటపడటం ఆందోళనకరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇలాంటి వ్యాఖ్యలకు ధైర్యం రావడం వెనుక రాజకీయ ప్రోత్సాహం ఉందా అనే సందేహం సహజమే.

**చిన్న వ్యాఖ్యలు, చిన్న సంఘటనలు అని కొట్టిపారేయలేని పరిస్థితి ఇది. భాషపై వెటకారం, చరిత్రపై వక్రీకరణ, సాంస్కృతిక ప్రతీకలపై దాడి, రాజకీయ గుర్తింపులపై అవమానం---ఇవన్నీ విడివిడిగా కనిపించినా, వాటి వెనుక ఒకే ధోరణి పనిచేస్తుందనే అభిప్రాయం బలపడుతోంది. తెలంగాణను కేవలం భౌగోళిక ప్రాంతంగా మాత్రమే చూసి, దాని స్వయంపాలన, సంస్కృతి, ఆత్మగౌరవాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే ప్రశ్నకు పాలకులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.**

కేసీఆర్ పాలనలో తెలంగాణ అస్తిత్వానికి ప్రాధాన్యం దక్కిందని ఉద్యమకారులు గుర్తుచేస్తున్నారు. బతుకమ్మ, బోనాలు రాష్ట్ర పండుగలుగా నిలిచాయి. తెలంగాణ వైతాళికుల పేర్లు, విగ్రహాలు, పురస్కారాలు, స్మారక నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. తంగేడు పువ్వు, పాలపిట్టకు అధికారిక గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్కు స్థానం దక్కింది. పాఠ్యాంశాల నుంచి ప్రపంచ తెలుగు మహాసభల వరకు తెలంగాణ ప్రత్యేకతకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నం జరిగింది.

ఇప్పుడు ఆ దృశ్యాలు క్రమంగా మసకబారుతున్నాయనే భావన తెలంగాణవాదుల్లో పెరుగుతోంది. అమరుల జ్యోతి కళ తప్పుతోందని, ఉద్యమ స్ఫూర్తి పక్కకు నెట్టబడుతోందని, సాంస్కృతిక చిహ్నాల స్థానంలో మళ్లీ పాత ఆధిపత్య రాజకీయాల ప్రతీకలు కనిపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్పై రాజకీయ వ్యాఖ్యలు, జెండాలపై వివాదాలు, తెలంగాణ పదంపై దాడులు---ఇవన్నీ ఒకే సమయంలో జరగడం యాదృచ్ఛికమా లేక వ్యూహాత్మకమా అన్నది ప్రజల ముందు ఉన్న ప్రశ్న.

తెలంగాణ ప్రజలు ఎప్పుడూ వైషమ్యాలను కోరలేదు. సమైక్యతను, సహజీవనాన్ని, పరస్పర గౌరవాన్ని విలువగా చూశారు. కానీ ఆ సహనాన్ని బలహీనతగా భావిస్తే చరిత్ర మరోసారి తన సమాధానం చెబుతుంది. తెలంగాణ అస్తిత్వం ఎవరికీ వ్యతిరేకం కాదు. అది తనను తాను కాపాడుకునే హక్కు. తన భాషను గౌరవించుకోవడం, తన సంస్కృతిని నిలబెట్టుకోవడం, తన చరిత్రను గుర్తుచేసుకోవడం, తన రాష్ట్రాన్ని తన ఆత్మగౌరవంతో నడిపించుకోవడం తెలంగాణ ప్రజల సహజ హక్కు.

కాబట్టి తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇది. వెటకారాన్ని వినోదంగా, అవమానాన్ని అభిప్రాయంగా, ఆధిపత్యాన్ని సహజత్వంగా అంగీకరించే రోజులు ముగిశాయి. తెలంగాణ అస్తిత్వంపై ఏ చిన్న దాడినైనా ప్రజాస్వామ్యబద్ధంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా ఎదుర్కొనే చైతన్యం అవసరం. ఎందుకంటే అస్తిత్వం ప్రమాదంలో పడితే, అది కేవలం ఒక ప్రాంత సమస్య కాదు; అది ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్న.

**తెలంగాణ చరిత్ర చెబుతున్న ఒకే హెచ్చరిక---తస్మాత్ జాగ్రత్త.**

ఎడిటర్: సందీప్ వి (నేటి ప్రస్థానం దినపత్రిక)

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/